ఆర్‌ఆర్‌ఆర్ భూనిర్వాసితులు, రైతులతో

5న చలో హైదరాబాద్

- ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి వెనుకాడం
- ఈ నెల 26 వరకు ప్రభావిత గ్రామాల్లో పర్యటన
- 27న 8 జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసనలు
- సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన వైఖరి ప్రకటించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌ఆర్‌ఆర్ భూనిర్వాసితులు, రైతులతో వచ్చేనెల ఐదో తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఎనిమిది జిల్లాల్లో 33 మండలాల్లోని 163 గ్రామాల్లోని రైతులు భూములు కోల్పోతున్నారని వివరించారు. ఈనెల 26 వరకు ప్రభావిత గ్రామాల్లో పర్యటిస్తామన్నారు. 27న ఎనిమిది జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు ఎంత భూమి కావాలో, ఏ అలైన్‌మెంట్‌ను అమలు చేస్తారో సిఎం స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు సార్లు అలైన్‌మెంట్‌ను మార్చారనీ, ఏ అలైన్‌మెంట్‌ను అమలు చేస్తారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించలేదన్నారు. దీంతో రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. పెద్దవారు, పలుకుబడి కలిగిన వారు, పెత్తందారుల భూముల జోలికి వెళ్లకుండా అలైన్‌మెంట్‌ను మార్చారని విమర్శించారు. దీంతో పేద రైతులు భూములు కోల్పోతున్నారని అన్నారు. రైతులతో మాట్లాడకుండా, నోటీసులు ఇవ్వకుండా సర్వే నెంబర్లను బ్లాక్ చేస్తున్నారని చెప్పారు. భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతులకు సరైన భరోసా ఇవ్వడం లేదన్నారు. భూమిని కోల్పోతే వారికి పరిహారం ఏం ఇస్తారో చెప్పడంలేదని అన్నారు. అందుకే భూమిని ఇవ్వడానికి వారు సిద్ధంగా లేరని వివరించారు. ఆర్‌ఆర్‌ఆర్‌తోపాటు దానిచుట్టూ రింగ్ రైలు వస్తుందంటున్నారని చెప్పారు. దానిచుట్టూ చెట్లు నాటడానికి అదనంగా భూమి అవసరం చెప్తున్నారని అన్నారు. ఆర్‌ఆర్‌ఆర్, రింగురైలు, చెట్లు నాటేందుకు సుమారు 40 వేల నుంచి 45 వేల ఎకరాల భూమి అవసరమని అంచనాలున్నాయని వివరించారు. దీంతో వేల మంది రైతులు నిర్వాసితులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆమోదం లేకుండా భూమిని తీసుకోవడం సరైంది కాదన్నారు. ఎకరా రూ.రెండు కోట్లు, రూ.మూడు కోట్లు, రూ.ఐదు కోట్లు ఉంటే, ప్రభుత్వం రూ.30 ఇస్తామంటున్నదని అన్నారు. దాని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఇంకోవైపు పెత్తందారుల భూములను వదిలేసి పేదల భూములను తీసుకుంటు ఒదని విమర్శించారు. ఇదే అమలైతే ప్రతిఘటన పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులకు భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాధ్యం కాకుంటే మార్కెట్ ధరకు అదనంగా మూడు రెట్లు పరిహారం ఇవ్వాలని కోరారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సూచించారు.

గాజులరామారంలో గుడిసెల కూల్చివేతకు ఖండన

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజుల రామారంలో పేదల గుడిసెలను హైడ్రా కూల్చివేయడాన్ని జాన్‌వెస్లీ ఖండించారు. వారు ఆక్రమించి చెరువులను కాదని, ప్రభుత్వానికి చెందిన క్వారీ భూముల్లోనే గుడిసెలు వేసుకున్నారని వివరించారు. మాజీ, తాజా ఎమ్మెల్యేలు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని విమర్శించారు. వారి జోలికి హైడ్రా పోలేదన్నారు. గుడిసెల కూల్చివేతతో పిల్లలు, కుటుంబ సభ్యులు వర్షంలోనే ఉంటున్నారని, తాగునీరు, కరెంటు లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కనీస మానత్వం ఉండాలని, ఆ భూమిలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వారు కొందరు ప్రజాప్రతినిధులకు డబ్బులు ఇచ్చి మోసపోయారని అన్నారు. పేదల నోర్లు కొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఆ భూమిని ఇస్తారా?అని ప్రశ్నించారు. ఈ వైఖరిని ప్రభుత్వం మార్చుకోవాలని కోరారు. వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి కట్టివ్వకుంటే పేదలను సమీకరించి ఉద్యమిస్తామని అన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం అనైతికం

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ కాల్పులు, యుద్ధం చేయడం అనైతికమని జాన్‌వెస్లీ విమర్శించారు. పాఠశాలలు, ఆస్పత్రులే లక్ష్యంగా ధ్వంసం చేస్తున్నదని అన్నారు. అక్కడి ప్రజలకు ఆహారం, నీళ్లు దొరక్క ఆకలి చావులకు గురవుతున్నారని వివరించారు. ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా అన్ని వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులతో కలిసి హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శన చేపడతామని అన్నారు. వామపక్షాలతో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఉంటూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దోబూచులాడుతున్నదని విమర్శించారు. పాలస్తీనా దేశం ఉండాలని, ఆ భూభాగం ఉండాలని కోరారు.

అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తులను లాక్కోవడం అన్యాయం : జూలకంటి

పరిశ్రమలు, ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తులను వారి ఆమోదం లేకుండా లాక్కోవడం అన్యాయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఇష్టం వచ్చినట్టు అలైన్‌మెంట్‌ను మార్చారని అన్నారు. కొందరి స్వార్థం కోసం విలువైన భూములను లాక్కుంటున్నారని చెప్పారు. మార్కెట్ ధరకు అదనంగా మూడు, నాలుగు రెట్లు పరిహారం ఇచ్చి భూములను శాస్త్రీయంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటూ రైతులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజల ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వడం లేదన్నారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. అలా చూపకుండా దౌర్జన్యంగా భూముల నుంచి వెళ్లిపోవాలని చెప్పడం సరైంది కాదన్నారు. కేరళలో నిర్వాసితులకు ప్రత్యామ్నా యం చూపి ఆ భూములను ప్రభుత్వం తీసుకుంటుందని గుర్తు చేశారు. గాజుల రామారంలో పేదల గుడిసెలను ధ్వంసం చేయడం సమంజసం కాదన్నారు. పేదల తరపున పోరాడతామని చెప్పారు. త్వరలోనే సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారం కోసం మెమోరాండం సమర్పించి ఒత్తిడి తెస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా భవన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు పొన్నం, సీతక్క

మహిళల సమగ్రాభివృద్ధికి కృషి

- మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎన్‌బిటి నగర్‌లో బుధవారం మహిళా భవన్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ఎమ్మెల్యే దానం నాగేందర్, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతతో కలిసి ప్రారంభించారు.. అనంతరం రూ.29.80 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. చాలా కాలంగా మాటలకే పరిమితమై ఆచరణకు నోచుకోని పనులు ఇప్పుడు హైదరాబాద్ మొత్తం అమలవుతున్నాయని, దానికి నిదర్శనం ఈ మహిళా భవనం ప్రారంభోత్సవమేనని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మహిళలు అన్ని రంగాలలో ఎదిగేందుకు వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. స్వయం ఉపాధి పథకాలతో మహిళలు వారి కాళ్ల మీద నిలబడేలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. మేయర్ మాట్లాడుతూ.. ఎన్‌బిటి నగర్‌లో మహిళా భవన్ నిర్మించాలన్న ఈ ప్రాంత ప్రజల 15 ఏళ్ల కలను ప్రభుత్వం, జిహెచ్‌ఎంసి నెరవేర్చిందన్నారు. ఈ క్రమంలో ఎదురైన కోర్టు కేసుల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేశామన్నారు. మహిళల వివిధ కార్యక్రమాల నిర్వహణకు, శిక్షణలు, గ్రూప్ సమావేశాలకు వేదికగా మహిళా భవన్ ఉపయోగపడనుందన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు.

26న బతుకమ్మ కుంట ప్రారంభం

- 29న సరూర్‌నగర్ స్టేడియంలో బతుకమ్మ వేడుకలు
- ఏర్పాట్లపై అధికారులకు సిఎస్ దిశానిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 26న హైదరాబాద్‌లోని బతుకమ్మ కుంటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు తెలిపారు. 29న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే భారీ బతుకమ్మ కార్యక్రమంతో పాటు, బతుకమ్మ కుంట ప్రారంభ ఏర్పాట్లపై ఆయన హైదరాబాద్‌లోని బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి సంబంధిత అధికారులతో బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి పాల్గొంటున్న ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలతో హాజరవుతున్నందున తగు ఏర్పాట్లు చేయాలని జిహెచ్‌ఎంసి, హైడ్రా అధికారులను ఆదేశించారు. బతుకమ్మ కుంట ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఆహ్వానాలను ప్రజాప్రతినిధులు, విఐపిలకు సకాలంలో అందించాలని జీహెచ్‌ఎంసీ కమీషనర్‌ను ఆదేశించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే పెద్ద సంఖ్యలో మహిళలు బతుకమ్మ కుంటకు చేరుకునే అవకాశమున్నందున శానిటేషన్, బందోబస్తు, తాగునీటి సదుపాయం తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. అలాగే 29న సరూర్‌నగర్ స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ కార్యక్రమం గిన్నెస్ బుక్ రికార్డ్‌లో నమోదయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు పది వేలకు పైగా మహిళలు బతుకమ్మలతో హాజరవుతారని వెల్లడించారు. సరూర్‌నగర్ స్టేడియంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుతో పాటు స్టేజీ, విద్యుదీకరణ, శానిటేషన్ చేపట్టాలని ఆదేశించారు. వీటితో పాటు, 27న ట్యాంక్‌బండ్‌పై సాయంత్రం బతుకమ్మ కార్నివల్, 29న పీపుల్స్ ప్లాజా, 30న ట్యాంక్‌బండ్‌పై పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశామని టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ వెల్లడించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేయడానికి సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరారు. టెలికాన్ఫరెన్స్‌లో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్, ఆర్‌టిసి ఎండీ సజ్జనార్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫైర్ సర్వీసుల డిజి నాగిరెడ్డి, టూరిజం శాఖ ఎండీ వల్లూరు క్రాంతి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు హరిచందన దాసరి, నారాయణ రెడ్డి, సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

త్వరలో విత్తన చట్టం ఆమోదం

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలోనే విత్తన చట్టం ఆమోదం పొందేలా చూస్తామని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేసి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, పర్యటనలు, ప్రభుత్వానికి ఇచ్చిన సూచనలపై కమిషన్ సభ్యులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోదండరెడ్డిని సభ్యులు గడుగు గంగాధర్, గోపాల్ రెడ్డి, చెవిటి వెంకన్న, భవానీ రెడ్డి, సునీల్ శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంలో కమిషన్ వరంగల్ ఏనుమాముల మార్కెట్, నల్లగొండ బత్తాయి మార్కెట్, నిజామాబాద్ పసుపు మార్కెట్ సందర్శించి అక్కడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. త్వరలోనే సిఎం సమీక్షా సమావేశం నిర్వహిస్తే మార్కెటింగ్‌తో పాటు అన్ని విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ములుగు జిల్లాలో రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోతే రూ.4 కోట్లను పరిహారం కింద ఇప్పిస్తామన్నారు. గత ప్రభుత్వం రైతు బంధు ఇచ్చి మిగిలినవన్నింటినీ గాలికి వదిలేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం రూ.ఒక లక్ష కోట్లు ఖర్చు చేసిందని, రూ.22 వేల కోట్లతో రుణమాఫీ, రైతుభరోసా లాంటి పథకాలను అమలు చేసిందన్నారు. రాబోయే ఏడాదిలో వ్యవసాయంలో మార్పు తీసుకురావడానికి కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.1,618 కోట్లు చెల్లింపు

- హౌజింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డెరెక్టర్ విపి గౌతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు రూ.1,612.37 కోట్ల రూపాయలను విడుదల చేసినట్టు హౌజింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డెరెక్టర్ విపి గౌతం తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2.12 లక్షల ఇళ్ల పనులు ప్రారంభం కాగా, ఇంతవరకు సుమారు ఒక లక్షా యాభై వేలకుపైగా చెల్లింపులు చేసినట్టు ఆయన బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి నిర్మాణపు పనుల దశలను బట్టి లబ్ధిదారులకు విడతల వారీగా మొత్తం రూ.5 లక్షలను వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నామని వివరించారు. లబ్ధిదారుల్లో ఎవరికైనా బిల్లు మొత్తం జమ కాని పక్షంలో, వారు తమ ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లి ఆధార్ నెంబర్‌ను ఖాతాకు అనుసంధానించుకోవాలని ఆయన సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 వేల పైచిలుకు గ్రామాలు, సుమారు నాలుగు వేల మున్సిపల్ వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు.

అనేక ప్రాంతాల్లో ప్రతినిత్యం ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పూర్తి పారదర్శకమైన విధానంతో, అధునాతన టెక్నాలజీని వినియోగించుకుంటూ ప్రతి సోమవారం నాడు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేస్తున్నట్టు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ వారంలో సెప్టెంబర్ 24 నాటికి రికార్డు స్థాయిలో 17 వేల ఇళ్ల పురోగతికి సంబంధించిన బిల్లుల నిమిత్తం రూ.188.35 కోట్లను లబ్ధిదారులకు విడుదల చేసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

గ్రూప్-1 నియామకాలకు గ్రీన్ సిగ్నల్

- హైకోర్టులో టిజిపిఎస్‌సికి ఊరట
- సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 అంశంలో టిజిపిఎస్‌సికి హైకోర్టులో ఊరట లభించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించింది. గ్రూప్-1 నియామకాలు చేపట్టుకోవచ్చని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల 15కి వాయిదా వేసింది.

గ్రూప్-1 తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్స్‌ను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పు వెలువరించింది. మెయిన్స్ జవాబు పత్రాలను ఎనిమిది నెలల్లో పునఃమూల్యాంకనం చేయించాలని.. లేదంటే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పుపై టిజిపిఎస్‌సి డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. దీనిపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది.

పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. మెయిన్స్ పత్రాలను పునఃమూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 8 నెలల్లోపు చేయకపోతే మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని స్పష్టం చేసింది. 2011లో గ్రూప్-1 నిర్వహించారు. ఆ తర్వాత 2022లో నిర్వహిస్తే సుప్రీంకోర్టు రద్దు చేసింది. 14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 నియామకాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ప్రక్రియను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. తెలుగులో మెయిన్స్ జవాబులు రాసిన వారిపట్ల పక్షపాతం చూపించారనడానికి ఎలాంటి ఆధారాలు లేవు" అని కోర్టుకు ఏజీ తెలిపారు. దీనిపై సిజె జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ స్పందిస్తూ మాల్ ప్రాక్టీస్, పేపర్ లీక్‌లాంటి ఘటనలు ఏమైనా చోటుచేసుకున్నాయా? పక్షపాతం చూపించారనడానికి ఏమైనా ఆధారాలున్నాయా?అని ఎజిని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారని ఆయన తెలిపారు. ఎపిలో నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల్లో తెలుగులో రాసిన అభ్యర్థులు తక్కువగా ఎంపికయ్యారని చెప్పారు. కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో పురుషులకు వాష్‌రూమ్‌లు లేవని.. అందుకే ఆ రెండు కేంద్రాల్లో మహిళలకు మాత్రమే కేటాయించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని వాళ్లకు సమీపంలోని కేంద్రాలు కేటాయించామన్నారు.

ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్లు జారీ చేయడాన్ని సైతం తప్పుబట్టారని ఎజి తెలిపారు. హాల్ టికెట్ల జారీ విషయంలో టిజిపిఎస్‌సికి అధికారం ఉంటుందని.. పరీక్ష కేంద్రాల కేటాయింపును తప్పుబట్టలేమని సిజె అన్నారు. అనంతరం సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ డివిజన్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. తుది తీర్పునకు లోబడే నియామకాలు ఉంటాయని సిజె జస్టిస్ ఎకె సింగ్ స్పష్టం చేశారు. డివిజన్ బెంచ్ స్టే విధించడంతో గ్రూప్-1 ర్యాంకర్లకు ఊరట లభించింది.

డిసిసిల నియామకంపై అవగాహనా కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిసిసిల నియామక ప్రక్రియలపైకాంగ్రెస్ అగ్రనేతలు పరిశీలకులకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే తెలంగాణలో డిసిసిల నియామకాల కోసం 22 మంది పరిశీలకులను ఎఐసిసి నియమించిన సంగతి తెలిసిందే. వారికి గురువారం ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయం ఇందిరా భవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొననున్నారు. వారు డిసిసి నియామకాలకు సంబంధించిన సంస్థాగత నిర్మాణ అంశాలను పరిశీలకులకు వివరించనున్నారు. దసరా పండుగ తర్వాత అక్టోబర్ 4వ తేదీ నుంచి క్షేత్ర స్థాయి పరిశీలనకు అబ్జర్వర్లు వెళ్లనున్నారు. సుమారు 10 రోజుల పాటు జిల్లాలో పర్యటనలు చేసి సమగ్ర సమాచారాన్ని పరిశీలకులు సేకరించనున్నారు. డిసిసి అధ్యక్షుల నియామకాల కోసం ఎఐసిసి పొందుపరిచిన నిబంధనల మేరకు మంచి అభ్యర్థులను పరిశీలకులు సిపారసు చేయనున్నారు.

1258 మంది సింగరేణి బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్లుగా చేరి భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ గనులు లేదా సర్ఫేస్ లో పనిచేస్తూ 190/240 మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ అసిస్టెంట్ కేటగిరి - 1 గా క్రమబద్ధీకరించేందుకు వీలుగా సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు విడుదల చేసింది. 2024 డిసెంబర్ 31 మరియు అంతకు ముందు తమ సంవత్సరకాలం సర్వీసు చేసిన వారిని భూగర్భ గనుల్లో అయితే 190 మస్టర్లు, ఓపెన్ కాస్ట్ గనుల్లో లేదా సర్ఫేస్ లో అయితే 240 మస్టర్లు పూర్తి చేసి ఉన్న బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1 గా క్రమబద్ధీకరించడానికి యాజమాన్యం అంగీకరించిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ క్రమబద్ధీకరణ విషయమై సింగరేణి సిఎండి ఎన్ బలరామ్, డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రులతో గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జరిపిన చర్చల అనంతరం యాజమాన్యం ఈ సానుకూల నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు క్రమబద్ధీకరణ ప్రతిపాదనలు పంపించాల్సిందిగా జనరల్ మేనేజర్ (పర్సనల్) , ఐఆర్ అండ్ పిఎం బుధవారం అన్ని ఏరియాలకు ఒక సర్క్యులర్ జారీ చేశారు.

సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు

- ఆయిల్ ఫెడ్ ఎండీకి మంత్రి తుమ్మల ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమయపాలన పాటించని సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ ఎండిని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ పనితీరు, నిర్వహణ, ఉద్యోగుల హాజరు, రైతులకు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. ఎండి శంకరయ్యతో చర్చించారు.

బిసి రిజర్వేషన్లపై పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ అంశాల ఆధారంగా పిటిషన్ వేశారని ప్రశ్నించింది. పిటిషనర్ అర్హతపై నిలదీసింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం ఏదైనా కాపీ ఇచ్చిందా అని ప్రశ్నించింది. పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా ఎలా పిటిషన్ వేస్తారని అడిగింది. మీడియా వార్తల ఆధారంగా పిటిషన్లు వేయడం సరికాదంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పత్రికా వార్తలను పరిగణనలోకి తీసుకోలేమని పేర్కొంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం చట్టవిరుద్ధమంటూ హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలైంది. పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285ఎ ప్రకారం రిజర్వేషన్లు కల్పించి ఆ మేరకు ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలంటూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డి, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరుకు చెందిన జలపల్లి మల్లవ్వలు పిటిషన్ దాఖలు చేశారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కల్పనతోపాటు అదే సమయంలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పిటిషనర్లు పేర్కొన్నారు. తద్వారా ఎన్నికల ప్రక్రియను, సూర్తిని దెబ్బతీసేలా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రిజర్వేషన్లు 50 శాతం దాటుతాయని ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. అందువల్ల పాత విధానంలోనే ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. పిటిషన్లను కొట్టివేసింది.

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT BENGALURU (SCCH-24)

M.V.C. No. 4559/2025

BETWEEN: Sri. K. Yogendranath Reddy ... PETITIONER

AND: Sri. Prasad Singeetham & another ... **RESPONDENTS**

NOTICE TO THE RESPONDENT No. 1

To, **Sri. Prasad Singeetham,** S/o. Vittal Rao Singeetham Major, Residing at No.545A Phase 3 Road No.86, Jubilee Hills, Hyderabad-500033

WHEREAS, the petitioner has instituted the above claim petition against you and another claiming compensation amount of Rs.25,00,000/- (Rupees twenty five lakhs only) together with cost and interest for the injuries sustained in the Motor Vehicle Accident occurred on 27-12-2024 at about 8.00 P.M by car No.AP-09-AY-1629 belonging to you at Gorantla-Puttaparthi Road, Near Nisha Garments, Gunthapalli village, Gorantla Mandal. Hence, take notice and appear before SCCH No.24 on **23-10-2025** at 11.00 A.M in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the claim petition.

In default of your appearance on the date and time aforementioned, the petition will be heard and disposed of exparte.

Given under my hand and the seal of the Court on 22-09-2025.

By order of the court, Assistant Registrar, Court of Small causes, Bangalore.

Advocate for Petitioner:
K. SOMASEKHAR REDDY
No.1, 1st Floor, M.C.Plaza, 1st Main, 1st Cross, Ganganagar Layout, Bengaluru-560032.

మార్క్‌ఫెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ (మార్క్‌ఫెడ్) కార్యాలయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ పనితీరు, నిర్వహణ, ఉద్యోగుల హాజరు, రైతులకు అందిస్తున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎండి శంకరయ్యను మంత్రి ఆదేశించారు

జిపిఒలు ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చాలి..!

- క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలను అందించాలి
- జిపిఒల ఆత్మీయ సమ్మేళనంలో లచ్చిరెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

గ్రామ స్థాయిలో ప్రజలకు, రైతులకు మేలు జరగాలనే ప్రభుత్వ సంకల్పం జిపిఒ (గ్రామ పాలన అధికారులు) లు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి లచ్చిరెడ్డి అన్నారు. ఇటీవల రెవెన్యూ శాఖలో నియమకమైన జిపిఒలు అంకిత భావంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. జిపిఒలపై ప్రభుత్వం పెట్టిన గురుతర బాధ్యతను అనునిత్యం గుర్తించుకోవాలన్నారు. బుధవారం ఉమ్మడి కరీంనగర్ నగర్ జిల్లా తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో గ్రామ పాలన అధికారుల ఆత్మీయ సమ్మేళనము కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని రెవెన్యూ గార్డెన్స్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లచ్చిరెడ్డి నూతనంగా నియామకమైన జిపిఒలకు భూభారతి చట్టంపై అవగాహన, విధులు/ బాధ్యతలతో పాటు పారదర్శకత, అంకితభావంతో కూడిన పౌరసేవలపై దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ రైతాంగానికి, ప్రజలకు మెరుగైన సేవలను క్షేత్రస్థాయిలోనే అందించాలనే సంకల్పంతో పాటు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం, పునర్నిర్మాణంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంపూర్ణ సహకారం, భూ భారతి చట్టం అమలుతో జిపిఒ వ్యవస్థ ఏర్పాటు సాధ్యమైందన్నారు. జిపిఒల సమస్యలను తనకు వదిలేసి ప్రజల సమస్యల పరిష్కారం బాధ్యతను జిపిఒలు స్వీకరించాలన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని రెవెన్యూ, భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. రెవెన్యూ చట్టాలకు సంబంధించి తెలంగాణ రెవెన్యూ పత్రికను నడపడం జరుగుతుందన్నారు. గతంలో ఐదు వేల మంది ఉంటే, నేడు పది వేల పై చిలుకు రెవెన్యూ ఉద్యోగులను రెవెన్యూ శాఖలోకి తీసుకున్నామన్నారు. జిపిఒలు ఉద్యోగం భావన తెలిసి ఉండాలన్నారు. ఏ ఒక్కరు తప్పు చేసినా అది మొత్తం వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందన్నారు. ప్రజలతో సఖ్యతగా ఉండాలని సూచించారు. జిపిఒల సమస్య తీరిందని, ఇతరుల సమస్యలను విస్మరించవద్దన్నారు.

కారుణ్య నియామకాలకు సంబంధించి త్వరలోనే తీపి కబురు వస్తుందన్నారు. ప్రజలకు మంచి సేవ చేస్తారని తాను భావిస్తున్నానని, కింది స్థాయి, నుండి ఉన్నత స్థాయి వరకు పదోన్నతులు వచ్చేలా చర్యలు తీసుకుంటా మని తెలిపారు. భూ జిపిఒల విధులు, పదోన్నతులు కూడా చాలా పకడ్బందీగా రూపొంచడం జరుగుతుంది. ఈ రోజు జిపిఒల వేతనాలకు సంబంధించి ప్రభుత్వ పెద్దలు, సిసిఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. త్వరలోనే వేతనాలు అందుతాయని తెలిపారు. లచ్చిరెడ్డి సారథ్యంలో గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టిజిఆర్‌ఎస్‌ఎ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అన్నారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వ్యక్తులే నేడు మళ్ళీ మన మధ్య తిరుగుతున్నారని అన్నారు. పదోన్నతుల విషయంలో కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిపిఒలు ఎలాంటి ప్రలోభాలకులోను కావద్దని సూచించారు. టిజిటిఎ జనరల్ సెక్రటరీ రమేష్ పాక మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువత ఎంత కీలకమో, రెవెన్యూ వ్యవస్థకు జిపిఒలు అంతే కీలకమన్నారు. పోరాడి సాధించుకున్న ఉద్యోగంను ఒక యజ్ఞంగా భావించి ప్రజలకు నాణ్యమైన సేవలను సత్వరం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిటిఎ జనరల్ సెక్రటరీ రమేష్‌పాక, టిజిఆర్‌ఎస్‌ఎ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి బిక్షం, రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ చిల్లా శ్రీనివాస్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కరీంనగర్ నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, రమేష్, టిజిటిఎ కరీంనగర్ నగర్ కార్యదర్శి రాజేశ్వరి, నవాజ్ షరీఫ్, రిటైర్డ్ తహసీల్దార్ గంప శంకరయ్య, మల్లారం అర్జున్, ఆంజనేయ ప్రసాద్, సాయి కిషోర్, బాపుదేవ్ పాల్గొన్నారు.

త్వరలో అభివృద్ధి పనులకు చర్యలు

- మంచాల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాఠశాలలో త్వరలోనే అభివృద్ధి పనులు చేపడుతామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ తెలిపారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచాల తెలంగాణ పబ్లిక్ స్కూల్ అభివృద్ధి కమిటీతో సమావేశం ఏర్పాటు చేసి పాఠశాలలో అభివృద్ధి చేయాల్సిన పనులపై చర్చించినట్టు తెలిపారు. ఆ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, జిల్లా విద్యాధికారి సుశిందర్‌రావు, విద్యా కమిషన్ సభ్యులు జోస్నా, పద్మజ, మండల విద్యాధికారి రాందాస్, స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ఎచ్.ఎం నారాయణరెడ్డి, పి.ఝాన్సీ, పిఎస్ హెచ్ఎం రుభియనా, మాజీ కో-ఆప్షన్ సభ్యులు అశ్వాల బాలరాజు, సీఆర్‌పీ జగదీష్ తదితరులు ఉన్నారు.

'గ్లోబల్ హెల్త్ కేర్ హబ్'గా హైదరాబాద్

- హైదరాబాద్‌లో 'హెచ్‌సిఎ హెల్త్‌కేర్' జిసిసి ప్రారంభం
- అమెరికా వెలుపల, భారత్‌లో మొట్టమొదటిది ఇదే
- 75 మిలియన్ డాలర్ల పెట్టుబడి.... 3 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు : మంత్రి శ్రీధర్ బాబు

జిసిసి సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌ను 'గ్లోబల్ హెల్త్ కేర్ హబ్'గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'హెచ్‌సిఎ హెల్త్‌కేర్' సంస్థ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జిసిసి)ను ఆయన రాయదుర్గంలో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. 'హెచ్‌సిఎ హెల్త్‌కేర్ ప్రధానంగా అమెరికా, యుకెలలో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఈ సంస్థకు 190 ఆస్పత్రులు, 2,400 కేర్ సైట్లు ఉన్నాయి. మొత్తం 3.16 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ఫార్చ్యూన్ 100 కంపెనీ వార్షిక ఆదాయం 70 బిలియన్ డాలర్లు' అని ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'ఇలాంటి దిగ్గజ సంస్థ అమెరికా వెలుపల భారత్‌లో తన మొట్టమొదటి జిసిసిని ఏర్పాటు చేసేందుకు తెలంగాణను ఎంచుకోవడం మనందరికీ గర్వకారణం. ఇది హైదరాబాద్‌కున్న ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ నైపుణ్యం కలిగిన మానవ వనరులకు నిదర్శనం' అని పేర్కొన్నారు. 'నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో హెచ్ సిఎ హెల్త్ కేర్ 75 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 620 కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఈ జిసిసి కేవలం ఉపాధి అవకాశాలను సృష్టించడమే కాకుండా, ఆరోగ్య సంరక్షణలో నాణ్యత, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ఐటి, సప్లై చైన్, ప్రొక్యూర్‌మెంట్, మానవ వనరులు, ఫైనాన్స్, అకౌంటింగ్ తదితర విభాగాల్లో ప్రస్తుతం 1200 మందికి, 2026 నాటికి మూడు వేల మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయి' అని చెప్పారు. 'హైదరాబాద్ గ్లోబల్ హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగాలకు ముఖద్వారంగా ఎదుగుతోంది. ప్రపంచ స్థాయి ఆసుపత్రులు, 800కు పైగా ఫార్మా కంపెనీలు, ప్రముఖ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ జిసిసిలు, అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలతో గ్లోబల్ హెల్త్ కేర్ హబ్ గా రూపాంతరం చెందుతోంది. అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూనే సరసమైన ఆరోగ్య సంరక్షణను ప్రపంచానికి అందిస్తుంది' అని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్, ఐటీ సలహాదారు సాయికృష్ణ, హెచ్ సిఎ హెల్త్ కేర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ మైక్ మార్క్స్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎమిలీ డంకన్, హైదరాబాద్ సెంటర్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ అతుల్ కపూర్ తదితరులు పాల్గొన్నారు.

మనం ప్రోత్సహిస్తే యువత అద్భుతాలు సృష్టించగలరు
- 'డేర్ టూ డ్రీమ్' శిబిరం ప్రారంభోత్సవంలో
మంత్రి శ్రీధర్ బాబు

యువతలో అపారమైన శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని, వారిని మనం ప్రోత్సహిస్తే అద్భుతాలు సష్టించగలరని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ సిఖ్ సొసైటీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా తూంకుంటలోని అలంకత రిసార్ట్‌లో 'డేర్ టూ డ్రీమ్' పేరిట సిఖ్ యువత కోసం ఏర్పాటు చేసిన నాలుగు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఆలోచనలకు, ఆకాంక్షలకు పరిమితులు పెట్టుకోవద్దని ఈ సందర్భంగా యువతకు దిశా నిర్దేశం చేశారు. కలలు కనడం ఎంత ముఖ్యమో, వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడటం కూడా అంతే ముఖ్యమన్నారు. గెలుపోటముల గురించి ఆలోచించొద్దని, లక్ష్యాన్ని చేరుకునే వరకూ పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నించాలని సూచించారు. కృషి, పట్టుదల లేకుండా ఏ కల సాకారం కాదన్నారు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా, నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సిఖ్ సొసైటీ ప్రతినిధులు తేజ్ దీప్ కౌర్, గగన్ కోహ్లీ, సురేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పెసల రైతుకు 'మద్దతు' కరువు

- మార్క్‌ఫెడ్ కేంద్రాలు లేక దక్కని గిట్టుబాటు
- వర్షాలతో అటు దిగుబడి రాక..ఇటు రేట్లు లేక వ్యథలు
- ఎకరానికి నాలుగు క్వింటాళ్లకుగాను రెండింటికే పరిమితం
- క్వింటాకు రూ.8,682 మద్దతుకుగాను రూ.5 వేలే చెల్లిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఖరీఫ్‌లో సాగు చేసిన పెసర పంటకు కనీస మద్దతు ధర కరువైంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.8,682 మద్దతు ధర ఎక్కడా అమలు కావటం లేదు. రబీలో ఎలాగూ మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఉండవు కాబట్టి కనీసం ఖరీఫ్‌లోనైనా వీటి ద్వారా గిట్టుబాటు ధర పొందుదామని ఆశించిన రైతులకు నిరాశే ఎదురయింది. ఓవైపు కోతల సమయంలో అధిక వర్షాలు వచ్చి పంట దెబ్బతిన్నది. ఎకరానికి నాలుగు క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన చోట రెండు క్వింటాళ్లే వచ్చింది. మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే కనీసం గిట్టుబాటు ధరైనా దక్కుతుందని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 70 వేల ఎకరాలకు పైగా పెసర సాగు చేయగా 20 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మార్క్‌ఫెడ్ కేంద్రాల ఏర్పాటు జాప్యమవుతుండడంతో ప్రయివేటు వ్యాపారులు అరకొర ధరలకే పెసలు కొంటున్నారు.

క్వింటాకు రూ. మూడు వేల వరకు నష్టం

మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయివేటు వ్యాపారులు అరకొర ధరలు మాత్రమే పెడుతున్నారు. తద్వారా క్వింటాకు రూ.3వేల వరకు రైతులు నష్టపోతున్నారు. గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పెసలు గరిష్ట ధర రూ.8,000, కనిష్ట ధర రూ.3000, నమూనా ధర రూ.5,700 మాత్రమే నమోదయ్యాయి. బుధవారం రూ.6,050గా ఉన్న నమూనా, రూ.నాలుగు వేలు నమోదైన కనిష్ట ధరలు గురువారానికి రూ.350 నుంచి వెయ్యి వరకు పడిపోయాయి. మార్కెట్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే స్థానికంగా కొనుగోళ్లు చేసే వ్యాపారులు మరింత తక్కువ ధరకు కొంటున్నారు. మార్కెట్ ధరలపై సుమారు రూ.500-1000 వరకు తక్కువ ధర పెడుతున్నారని రైతాంగం వాపోతోంది. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధర పెడుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

గణనీయంగా తగ్గిన దిగుబడి

ఈ సీజన్‌లో పంట కోతకు వస్తున్న దశలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిశాయి. ఈ వానలకు అనేక చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. వేల ఎకరాలు పూర్తిగా పనికి రాకుండా పోయాయి. వచ్చిన దిగుబడి కూడా నాణ్యత సరిగా లేదని వ్యాపారులు తిరకాసు పెడుతున్నారు. భారీగా ధరలు తగ్గిస్తున్నారు. సాధారణంగా ఎకరానికి నాలుగు క్వింటాళ్లకు పైగా పెసలు దిగుబడి వస్తుంది. కానీ మూడు ఎకరాలు దూస్తే డబ్బా అవుతున్నాయని, డబ్బాకు ఎనిమిది బస్తాలు అంటే దీన్ని ఆరబెట్టి, తరుగు తీస్తే ఆరు బస్తాల చొప్పున దిగుబడి వచ్చినట్టు. పంట కోత సమయంలో వర్షాలు పడి గింజలు ఊబడాలు (గింజకు బూజు) అయ్యాయని రైతులు వాపోతున్నారు. దిగుబడులు సగానికి సగం తగ్గాయని అంటున్నారు. కాబట్టి మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.8,682 మద్దతు ధరకు కొనుగోలు చేస్తే కొంతలో కొంతైనా మేలు జరుగుతుందని రైతులు, రైతుసంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. సీజన్‌లో ఇప్పటికే కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన మార్క్‌ఫెడ్ కేంద్రాల నిర్వాహకుల శిక్షణ పేరుతో జాప్యం చేస్తుండటంతో రైతాంగం నష్టపోతోంది. గత ఖరీఫ్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వెయ్యి టన్నుల పెసలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది.

పెట్టుబడులు కూడా రావట్లేదు : రాయల వెంకయ్య, కొణిజర్ల

పెసర పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. మార్కెట్‌లో అమ్మితే గిట్టుబాటు కావటం లేదు. జెండా పాట రూ.6,500 ఉందని మార్కెట్‌కు వస్తే ఒక్కరోజులోనే రూ.300కు పైగా తగ్గించారు. క్వింటా రూ.నాలుగు వేలకు కూడా కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న ధరకు అమ్మితే పెట్టుబడులు కూడా రావటం లేదు. పెసర సాగుకు ఎకరానికి రూ.10వేల పెట్టుబడి పెట్టాలి. ఎకరానికి నాలుగు క్వింటాళ్లు రావాల్సింది రెండు క్వింటాళ్లే వచ్చాయి. ప్రస్తుతం ఉన్న ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావు. పెట్టుబడి కూడా పూడదు.

మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి : బొంతు రాంబాబు, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి

తక్షణం మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేసి కేంద్రం ప్రకటించిన పెసల మద్దతు ధర క్వింటా రూ.8,682 చొప్పున కొనుగోలు చేయాలి. ఇప్పటికే మార్క్‌ఫెడ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సింది.. ఆలస్యమవుతుండటంతో ఒక్కో క్వింటాపై రైతులు రూ.3వేల వరకు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వర్షాలకు దెబ్బతిన్న పెసర పంటను కూడా కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలి.

సిబ్బంది శిక్షణలో ఉన్నారు : సునీత, మార్క్‌ఫెడ్ మేనేజర్, ఖమ్మం జిల్లా

ప్రస్తుతం మార్క్‌ఫెడ్ కేంద్రాల నిర్వాహక సిబ్బంది శిక్షణలో ఉన్నారు. ఇదీ పూర్తయ్యాక రాష్ట్రవ్యాప్తంగా కేంద్రాలు తెరుచుకుంటాయి. దీనికి వారానికి పైగా సమయం పట్టొచ్చు. గతేడాది మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరిపాం. ఇప్పుడు కూడా ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ద్రోహం

- సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అభయ హస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక డిక్లరేషన్ విడుదల చేసిన ఆ పార్టీ ..అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ సభ్యులు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గిగ్ వర్కర్లకు అండగా ఉంటామన్న కెటిఆర్... వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని వారికి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు గిగ్ వర్కర్ల కసోం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, బీమాతో కూడిన సామాజిక భద్రత, సరైన వేతనాలతో పాటు మరణించిన కార్మికులకు పరిహారం చెల్లింపు వెంటనే అమలు చేయాలని డిమాండ్ కోరారు. గిగ్ వర్కర్ల హామీల అమలు బాధ్యతను తీసుకుంటానన్న రాహుల్ గాంధీ, వీరి సమస్యలపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తే బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ తెలిపారు.

రైతు ద్రోహి కాంగ్రెస్.. ప్రజా ద్రోహి బిజెపి

రైతు ద్రోహి కాంగ్రెస్.. ప్రజా ద్రోహి బిజెపి అని కెటిఆర్ విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కరీంనగర్‌కు చెందిన పలువురు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ యూరియా అడిగితే రైతులపై రేవంత్ సర్కార్ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తోందని, జిఎస్‌టి పేరుతో ఎనిమిదేళ్లలో బిజెపి రూ.15 లక్షల కోట్లు దోచుకుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తుంటే, కేంద్రంలోని బిజెపి సర్కార్ సామాన్యుడి నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు.

పండ్ల వ్యాపారి దారుణ హత్య

- రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పండ్ల వ్యాపారిని దారుణంగా హత్య చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఎసిపి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం బుద్వేల్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సర్వీస్ రోడ్డుపై ఒక వ్యక్తి మృతదేహం ఉందని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డు ప్రకారం బండ్లగూడ ప్రాంతానికి చెందిన మినాజుద్దీన్‌గా గుర్తించారు. అతడు స్థానికంగా పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నట్టు గుర్తించారు. అయితే దుండగులు ఎక్కడో ఇతన్ని హత్య చేసి ఇక్కడ పడేసి వెళ్లిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

కవులు కళాకారులు సామాజిక చైతన్యానికి సారథులు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి కల్చరల్

సామాజిక చైతన్యానికి కవులు కళా కారులు సారథులు అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ నిర్వాహణలో జరుగుతున్న బతుకమ్మ సంబరాలులో భాగంగా రవీంద్ర భారతి ప్రధాన వేదికపై ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తదుపరి ప్రత్యేక రాష్ట్ర సాధనలో కవులు, కళాకారులు, సాహితీవేత్తలు క్రియాశీలక పాత్ర పోషించారని చెప్పారు. నన్నయ తిక్కన ఎర్ర ప్రగడ నుంచి కృష్ణ శాస్త్రి, దాశరథి కాళోజీ వంటి వారు తెలుగు సాహిత్యాన్ని సంపన్నవంతం చేశారని గుర్తు చేశారు. సాహిత్యం జ్ఞానం కలిగిస్తుందని వివరించారు. నేడు యువతలో పెడ ధోరణులు సామాజిక రుగ్మతలు పట్టి వున్నాయన్నారు. కవులు సాహితీ వేత్తలు వీటిపై దృష్టి సారించాలని ఉత్తమ సమాజాన్ని నిర్మించే దిశగా వారి కార్యక్రమం సాగాలని అన్నారు. ఇందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి స్వాగతం పలికారు. వేదికపై నెల్లుట్ల రమాదేవి ఇతర కవులు రచయితలు సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష

- యూరియా తెప్పించడంలో కేంద్ర మంత్రులు విఫలం
- బిసి రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివక్ష చూపుతోంది. రాష్ట్రానికి రావాల్సిన, కావాల్సిన యూరియా, నిధులు తీసుకురావడంతో విఫలమైన ఇక్కడి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాజీనామా చేయాలి. జిఎస్‌టి తగ్గించామని చెబుతున్నా.. వస్తువుల ధరలు మాత్రం తగ్గలేదు. జిఎస్‌టి తగ్గింపుతో రూ.2.5 లక్షల కోట్ల భారాన్ని తగ్గించడంతో ప్రతి కుటుంబానికీ రూ.15 వేల ఆదాయం మిగిల్చామని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ అంటున్నారు. అయితే ఇన్నేళ్లలో జిఎస్‌టి పేరుతో దోచుకుని, కార్పొరేట్లకు ధారబోసిన కేంద్రం వైఖరిని కూడా ప్రజలు గమనిస్తున్నారు' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ చెప్పారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి రావాల్సిన 3.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర మంత్రులు తీసుకురాకపోవడంతో రాష్ట్ర రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అంతర్జాతీయంగా బిజెపి, ప్రధాని మోడీ విధానాల వల్ల దేశం తన అస్తిత్వాన్ని కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా విధించిన టారిఫ్‌ల యుద్ధంలో సరైన విధంగా పోరాడలేకపోయిందన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని భారతదేశం పెంచి పోషిస్తోందని ఐక్యరాజ్య సమితిలో డొనాల్డ్ ట్రంప్ ఆరోపిస్తుంటే, మోడీ ఖండించకపోవడం సరికాదన్నారు. అమెరికాలో నిరుద్యోగానికి భారతీయులే కారణమని తప్పుడు కూతలు కూస్తుంటే ప్రధాని ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

కరీంనగర్ జిల్లాకు 45 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటే, ఇప్పటివరకు 30 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని ఈ విషయంలో ఇక్కడి ఎంపి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఏం చేస్తున్నట్టు? అని సిపిఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, కె.నాగమణి, డి.నరేష్ పటేల్, సీనియర్ నాయకులు పుల్లెల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేయాలి

- ప్రతి రైతుకీ యూరియా కొరత లేకుండా చూడాలి
- భారీ వర్షాలకు నష్టపోయిన పత్తి, పెసర రైతులను ఆదుకోవాలి
- ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి : పోతునేని, నున్నా

పాదయాత్రలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని పాతర్లపాడు గ్రామం నుంచి చింతకాని మండల కేంద్రం వరకు పాదయాత్ర నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు కొండ్రు జానకి రామయ్య జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా రేపల్లెవాడ గ్రామంలో వర్షాలతో నష్టపోయిన పత్తి పంటను పాదయాత్ర బృందం సందర్శించింది. అనంతరం సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిజమైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇల్లు రాక నష్టపోయారని, ఒక్కొక్క గ్రామంలో ఇల్లు, పొలాలు ఉన్న వారికి, కాంగ్రెస్ నాయకులకు ఇష్టం వచ్చిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని ఆరోపించారు. యూరియా కోసం సొసైటీ కార్యాలయాల దగ్గర రైతులు తెల్లవారుజాము నుంచే క్యూలో నిలబడి ప్రాణాలు పణంగా పెట్టి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. తక్షణమే గ్రామాల్లో రైతులకు యూరియా అందుబాటులో ఉంచేలా చూడాలని కోరారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు పత్తి, పెసర రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారని తెలిపారు. మళ్లీ విత్తనాలు నాటి సాగుచేయగా.. తీరా పంట చేతికి వచ్చేసరికి వర్షాలు, వరదలతో పంటలు కొట్టుకుపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. మధిర నియోజకవర్గంలో ఎక్కువ శాతం రైతులు పత్తి, పెసర సాగు చేసి ఎకరానికి రూ.50 వేలు వరకు పెట్టుబడులు పెట్టారని తెలిపారు. తీరా వర్షాలతో పంట చేతికి రాకపోయేసరికి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రకు బిఆర్ఎస్ మండల కమిటీ సంఘీభావం తెలిపింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ బాబ్జి ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సామినేని రామారావు, సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వత్సవాయి జానకిరాములు, నాయకులు కాటబత్తిని వీరబాబు, రౌతు అప్పారావు, మాదినేని రవి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రియుడి ఇంట్లో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్ నగరంలోని నాగోల్‌లో బుధవారం చోటు చేసుకుంది. మూడేళ్ల బాబుతో వివాహిత (38) ప్రియుడు అనిల్ నాయక్ ఇంటికి వచ్చారు.

రెండ్రోజుల పాటు ఆ ఇంట్లోనే ఉండి అనిల్ బయటకి వెళ్లినప్పుడు బాత్రూమ్‌లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. దీంతో షాక్‌కు గురైన అనిల్ ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఈ నెల 21న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

సామాజిక తెలంగాణ కోసం పనిచేద్దాం : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర సాధన కోసం అందరం కలిసి పనిచేసి విజయం సాధించామని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కవిత అన్నారు. తదుపరి లక్ష్యం సామాజిక తెలంగాణ కోసం పని చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. "ఆత్మ గౌరవంతో కూడిన తెలంగాణ కోసం పనిచేద్దాం. పునరేకీకరణ కోసం కలిసి పోరాటం చేయాలి. రాష్ట్రంలో పేదల వైపు ఉండి పోరాడుతాం. కుత్బుల్లాపూర్‌లో హైడ్రా బాధితులైన పేదల పక్షాన పోరాటం చేస్తాం. భవిష్యత్తులోనూ పేద ప్రజల కోసం పోరాటాలు కొనసాగిస్తాం" అని కవిత తెలిపారు.

30 వరకు భారీవర్షాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అల్ప పీడనాల ప్రభావంతో తెలంగాణలో ఈ నెల 30 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనం 12 గంటల్లో బలహీనపడే అవకాశం ఉందని పేర్కొంది.. గురువారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అది ఈ నెల 26 నాటికి వాయుగుండంగా మారనుందని వాతావరణకేంద్రం వెల్లడించింది. తదుపరి ఈ వాయుగుండం దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర కోస్తా తీర ప్రాంతంలో ఈ నెల 27న తీరం దాటే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఇవాళ, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

బుధవారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గురువారం ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్ సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. అల్ప పీడనాల ప్రభావంతో తెలంగాణలో ఈ నెల 30వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనం 12 గంటల్లో బలహీనపడే అవకాశం ఉందని పేర్కొంది.. గురువారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అది ఈనెల 26 నాటికి వాయుగుండంగా మారనుందని వాతావరణకేంద్రం వెల్లడించింది.

అగ్రో ఫారెస్ట్రీ ప్రోత్సాహకానికి అటవీశాఖ సహకారం

- పిసిసిఎఫ్ సువర్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కలపకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా రైతులు తమ పంటపొలాల్లో బ్యాంబూ, యూకలిప్టస్, సుబాబుల్ వంటి చెట్ల పెంపకంపై దృష్టి పెట్టాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పిసిసిఎఫ్, అటవీ దళాల అధిపతి) సువర్ణ సూచించారు. అగ్రో ఫారెస్ట్రీ ప్రోత్సాహకానికి అటవీశాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. బెంగళూరుకు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ (ఐసీఎఫ్ఆర్ఈ, ఐడబ్ల్యూఎస్‌టీ) సంస్థతో కలిసి హైదరాబాద్‌లో ఓ సదస్సు నిర్వహించారు. కలప ఆధారిత అభివృద్ధికి కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని ఇందులో నిర్ణయించారు. కలపయేతర వ్యవసాయ ఉత్పత్తులతో కొత్త సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఫర్నీచర్ తయారు చేసుకోవాలని సువర్ణ సూచించారు. ఈ సమావేశంలో ఐడబ్ల్యూఎస్‌టి డైరెక్టర్ శక్తిసింగ్ చౌహాన్.. తాజా సాంకేతికతలు, పరిశోధన ఫలితాలు, శిక్షణా అవకాశాలపై టింబర్ డిపో ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో ఎనిమిది వుడ్ బేస్డ్ ఇండస్ట్రీ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.